

మీ బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే...

ప్రజాశక్తి- బూర్జ

మీ బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద్ అన్నారు. మండలంలోని ఓ.వి.పేట ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నారీశక్తిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చెడి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన శిఖరాలు, బంగారు భవిష్యత్ అడుగులు వేసుకోవాలన్నారు. విద్య, క్రీడలు, ఉద్యోగాల సాధనపై పోటీతత్వం కల్పించుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవళిక, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపో విభజిస్తే ఉద్యమం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు డిమాండ్ చేశారు. ఎపి స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన హమాలీలు నగరంలోని ఆర్ అండ్ బి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి, అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎచ్చెర్లలో వంద మంది దళిత కుటుంబాలకు చెందిన నాలుగెకరాల భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ఎచ్చెర్లలో యారక్ బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందని చెప్పారు. సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాలను కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి కల్పించారని తెలిపారు. అప్పటి ప్రభుత్వ సారా

కలెక్టరేట్ వద్ద హమాలీల ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న హమాలీలు

తయారీ నుంచి ఇప్పుడు ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐఎంఎల్ డిపోగా నడుస్తున్న దీనిలో 80 మంది హమాలీలుగా లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేస్తూ జీవనాధారం పొందుతున్నారని చెప్పారు. ఇప్పుడు దాన్ని విడగొట్టి కొత్తగా మరో డిపో ఏర్పాటు ఏర్పాటు అవసరం లేదన్నారు. ఎచ్చెర్లలో ప్రభుత్వ సొంత గోదాములో స్టాక్ ఉంచి మద్యం సరఫరా చేస్తుంటే, అదనంగా టెక్కలి మండలం తిర్లంగిలో మరో డిపో ప్రైవేట్ గోదామును అద్దెకు తీసుకొని ప్రారంభించేందుకు ప్రభుత్వం ఈనెల 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రైవేటు గోదాము వల్ల ప్రభుత్వం అద్దె చెల్లించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని నెలకు లక్షలాది రూపాయలు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని చెప్పారు. మరోవైపు ఎచ్చెర్ల డిపో పైనే ఆధారపడిన 80 దళిత, పేద కుటుంబాలకు చెందిన హమాలీలకు తగినంత ఆదాయం లేక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎచ్చెర్ల డిపోను యథావిధిగా కొనసాగించి హమాలీల ఉపాధిని కాపాడాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, కోశాధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ హమాలీలు ఒంటరిగా లేరని, జిల్లావ్యాప్తంగా కార్మికులు వారి పోరాటానికి అండగా ఉంటారన్నారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎపి బిసిఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు ఎన్.రమణ, జి.శ్రీనివాసరావు, ఎల్.సీతారాం, ఎల్.రాము తదితరులు పాల్గొన్నారు.



సత్తారు గోపి మృతదేహం (ఇన్‌సెట్‌లో గోపి ఫైల్)

పడగవిప్పిన పాత కక్షలు

ఫరీదుపేటలో వైసిపి నాయకుడు గోపి దారుణ హత్య

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండలంలోని ఫరీదుపేటలో రాజకీయ పాత కక్షలు మళ్లీ పడగవిప్పాయి. విద్యా కమిటీ చైర్మన్, ఉప సర్పంచ్ భర్త సత్తారు గోపి (46) నడిరోడ్డుపై శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికంగా ఈ ఘటన సంచలనం సృష్టించగా, ఆ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు మేరకు... ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవికి ముఖ్య అనుచరునిగా ఉన్న గోపి కొయిరాల జంక్షన్‌లో సిసి రోడ్డు కాంట్రాక్టు పనులు పర్యవేక్షించేందుకు అదే గ్రామానికి చెందిన సత్తారు కోటితో కలిసి వెళ్తుండగా ఐదుగురు వ్యక్తులు వెంబడించారు. కొయిరాల జంక్షన్ సమీపాన వచ్చేసరికి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై మారణాయుధాలతో గోపి తలపై బలంగా కొట్టారు. అక్కడ్నుంచి ఒక భవనం వెనుక వైపు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం కావడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. గోపితో పాటు ఉన్న కోటి ప్రాణభయంతో పారిపోయాడు. హత్య విషయం తెలియగానే ఫరీదుపేట గ్రామం ఉలిక్కిపడింది. ఆగ్రహించిన వైసిపి కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్దసంఖ్యలో ఘటనాస్థలికి చేరుకున్నారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న డిఎస్‌పి వివేకానంద పోలీసు సిబ్బందితో సహా ఘటనాస్థలానికి చేరుకున్నారు. నిందితులను అరెస్టు చేస్తామని హామీనిచ్చి ఆందోళనకారులను శాంతింపజేశారు. ఘటనాస్థలాన్ని క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ పరిశీలించాయి. ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. గ్రామంలో నెలకొన్న



పరిశీలిస్తున్న ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. భారీగా మోహరించిన పోలీసులు గ్రామాన్ని జల్లెడ పట్టారు. గ్రామం వచ్చే వహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

మృతుడు గోపి గ్రామ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించేవారు. ఆయన విద్యా కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, ఆయన భార్య పుణ్యవతి ఉప సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కుమారుడు ధర్మతేజ, కుమార్తె పావని ఉన్నారు. గోపి ప్రత్యర్థులే ఈ హత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. మృతుని భార్య సుగుణ ఏడుగురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అనుమానితులు కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా గతేడాది ఆగస్టులో ఎంపిపి చిరంజీవి అనుచరుడు కూన ప్రసాదరావు టిడిపి వర్గీయుల చేతిలో హత్యకు గురయ్యాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు జె.ఆర్ పురం సిఐ అవతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారత వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భారత వాయుసేనలో ఉద్యోగాల కోసం రాష్ట్ర యువతకు అద్భుత అవకాశం కల్పిస్తూ నియామక ప్రకటన విడుదలైంది. సంబంధించిన వివరాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు. ఒక్కసారి కాకుండా రెండు విభాగాల్లో ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ఎయిర్‌మెన్ (మెడికల్ అసిస్టెంట్) స్థాయిలో శాశ్వత ఉద్యోగాలు ఉన్నాయి. అలాగే అగ్నిపథ్ స్కీమ్ కింద 'అగ్నివీర్వాయు (కాంబటెంట్)' కేటగిరీలో నాలుగేళ్ల పాటు సేవా అవకాశాలు కల్పించనున్నారు. ఎంపికైన వారిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగాల కోసం ఎంపిక చేస్తారు. ఈ నియామకాలకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జూలై 11న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. జూలై 31న రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తిగా https://airmenselection.cdac.in, https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్లలో జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రొవిజనల్ అడ్మిట్ కార్డులు జారీ చేస్తారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించేందుకు వీలుగా సంబంధిత వివరాలను ప్రత్యేకంగా అందించామని కలెక్టర్ తెలిపారు. జిల్లా యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు https://airmenselection.cdac.in, https: //agnipathvayu.cdac.in/AVవెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చునని అన్నారు.

రేపు స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డిఎస్ఎ స్విమ్మింగ్ పూల్ వద్ద ఈ నెల 13న రాష్ట్రస్థాయి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు స్విమ్మింగ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.ఎస్.వి.ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. నిపుణులు ఆధ్వర్యాన పారదర్శకంగా కీడాకారులు ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

కళాశాల మైదానం స్వాధీనం



స్థలంలో వేసిన మొక్కలను ట్రాక్టర్‌తో దున్నుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- సర్వే చేసి అప్పగించిన అధికారులు
- చదును చేసిన విద్యార్థులు
- ఫలించిన ఎస్ఎఫ్ఐ పోరాటం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జి.సిగడాం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం కబ్జాపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చేసిన పోరాటం ఫలించింది. దురాక్రమణకు గురైన స్థలాన్ని తహశీల్దార్ నేతృత్వాన రెవెన్యూ సిబ్బంది పోలీసుల సమక్షంలో శుక్రవారం సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి కళాశాలకు అప్పగించారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు ఆ స్థలంలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన గడ్డివాము, కర్రల దుంగలను తొలగించి చదును చేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు మాట్లాడుతూ కళాశాలకు ఆటస్థలం లేకపోవడంతో దశాబ్దాల కిందట గ్రామానికి చెందిన ఒకరు 1.50 ఎకరాల స్థలాన్ని దానం చేశారని చెప్పారు. ఎక్కడో దూరపు చుట్టరికాన్ని ఉపయోగించుకొని ఆ స్థలాన్ని వి.హరనాథ్ బాబా ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై కోర్టును ఆశ్రయిస్తే ఆ స్థలం కళాశాలకు చెందుతుందని 2018 ఏప్రిల్ 12న జిల్లా కోర్టు, లోకాదాలత్ తీర్పునిచ్చాయన్నారు. అధికార అండతో అందరినీ భయపెట్టి ఆట స్థలాన్ని తన ఆధీనంలోనే ఉంచుకున్నాడని వివరించారు. ఈ కళాశాలలో 200 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారి మానసిక ఆరోగ్యం పెంపొందేందుకు, చదువులోనూ రాణించేందుకు క్రీడా ప్రాంగణం అవసరమన్నారు. విద్యార్థులు సైకిల్ పార్కింగ్ చేసుకోవడానికి, చివరికి నడిచే తోవ కూడా లేకుండా చేశారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు, గ్రామస్తుల సమిష్టి పోరాటంతో ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.ఖగేష్, ఉపాధ్యక్షులు ఎం.సంతోష్, సిహెచ్.రాజు, జిల్లా కమిటీ సభ్యులు చిన్న, జయరాం, టి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'బాబు మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి- నరసన్నపేట

చంద్రబాబు తన మార్కు ష్యూరిటీ మోసాలతో ప్రజలను దారుణంగా వంచిస్తున్నారని, టిడిపికి ప్రజలే వచ్చే ఎన్నికల్లో గ్యారంటీగా తగిన బుద్ధి చెబుతారనిఎమ్మెల్సీ కాంభా రవిబాబు, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, జిల్లా పరిశీలకులు ఘాటుగా విమర్శించారు. స్థానిక ఎస్ఎల్‌విడి కళ్యాణ మండపంలో వైసిపి నాయకులు ధర్మాన చైతన్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతున్న కృష్ణదాస్

మాట్లాడుతూ చంద్రబాబు తన హయాంలో గ్యారంటీ మోసాలు, ష్యూరిటీ పేరుతో పేద ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని అన్నారు. ఇలాంటివి మళ్లీ జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో జగనన్న పాలనతో పోల్చి చూస్తే సంక్షేమ పథకాలతో ప్రజలు ఎక్కడ సంతృప్తి వ్యక్తం చేయడం లేదన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికీ ఆర్థిక స్థిరత్వం తీసుకువచ్చేలా వైసిపి ప్రభుత్వం చక్కటి పాలన అందించిందని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ మోసాలతో టిడిపి ప్రభుత్వం ప్రజలను వంచించిందని అన్నారు. ప్రజలు వైసిపికి పూర్తి మద్దతుగా నిలుస్తారని అన్నారు. చంద్రబాబు చేసిన అవినీతి, మోసాలను మరిచిపోలేరని అన్నారు. ఇప్పటికే తాము ఏం కోల్పోయామో ప్రజలు స్పష్టంగా తెలుసుకోగలుగుతున్నారని వివరించారు. అనంతరం వైసిపి బలోపేతంపై కార్యాచరణను రూపొందించారు. కేడర్ అంతా ఒక్కటిగా ఉంటేనే మరోసారి జగనన్నను ప్రజా శ్రేయస్సు కోసం నిలుపుకోగలమని నేతలు పునరుద్ఘాటించారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

పారిశుధ్యం లోపంతోనే ప్రబలుతున్న వ్యాధులు

జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో పారిశుధ్యం లోపం కారణంగానే వ్యాధులు ప్రభలుతున్నాయని జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని బొమ్మిక గిరిజన గ్రామంలో మలేరియా కేసులు వెలుగులోకి రావడంతో శుక్రవారం సందర్శించి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో గత రెండు నెలల్లో మూడు మలేరియా కేసులు నమోదు అవుతున్నాయని అన్నారు. కార్యదర్శి కళ్యాణ బాబుకి ఈ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారమూ పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకర్లను శుద్ధి చేయాలన్నారు. గ్రామంలో రక్త పరీక్షలు నిర్వహిస్తే మలేరియా కేసులు తప్ప మరే ఇతర వ్యాధులు నమోదు కాలేదన్నారు. గ్రామంలో ఆరోగ్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈయనతో పాటు హెల్త్ యూనియన్ ఆఫీసర్ శంకరరావు, డాక్టర్ జి.రాజశేఖర్, ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, సిహెచ్ఒ అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు సరోజిని, తేజరో, ఎఎన్ఎంలు ఆదిలక్ష్మి రమణమ్మ, ఆశా వర్కర్లు ధనలక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - సోంపేట, కంచిలి

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. కంచిలి, సోంపేట పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు పరిష్కారం తదితర అంశాలను పరిశీలించి మహిళా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి వాటి దర్యాప్తు, పురోగతి, కేసుల ప్రాపర్టీ వివరాలపై ఆరా తీశారు. రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా భద్రత, సైబర్ నేరాలపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ విధులను మరింత పటిష్టంగా నిర్వహించాలన్నారు. గ్రామస్తులతో మమేకమై ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు గ్రామ సందర్శన, దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో సోంపేట సిఐ మంగరాజు, సోంపేట, కంచిలి ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

పలాస: ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించి వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. ఆయా సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, అదృశ్యం, చీటింగ్ ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయి.

కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కుటుంబ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం ఇచ్చిన నినాదం 'మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భధారణ గురించి ఆలోచించాలి' అని అన్నారు. చిన్న కుటుంబాలతోనే దేశం పురోభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డెమో



ర్యాలీలో పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్ఒ అనిత

అధికారి డిఐఒ డా.రామదాసు, ఎస్ఒ రామనాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్.విజయలక్ష్మి, మంత్రి వెంకటస్వామి, ఆశావర్కర్లు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న గిరిజన యువకులు

గిరిజన యువకులకు శిక్షణ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని అడ్డంగిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివాసీ రైతు ప్రగతి ఎఫ్‌పిఒ సభ్యులతో పైనాపిల్‌పై విలువ ఆధారిత జోడింపుపై గిరిజన యువకులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఏరియా కో-ఆర్డినేటర్ సవర ఆనందరావు మాట్లాడుతూ అడ్డంగి ప్రాంతంలో జూన్, జూలై నెలల్లో పైనాపిల్ పంట విస్తారంగా పండుతుందని అన్నారు. ఈ సమయంలో వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల పంట గిట్టుబాటు ధర పొందలేక, మార్కెటింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనికి పరిష్కారంగా పైనాపిల్‌తో విలువ ఆధారిత జోడింపు ద్వారా జామ్, జ్యూస్ తయారీ చేయాలన్నారు. దీనివల్ల రైతులకు పంట నష్టపోకుండా స్థిరమైన ధర పొందుతారని పేర్కొన్నారు. అలాగే యువకులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో బి.వసంత, తోట మిన్నారావు, సవర నారాయణ పాల్గొన్నారు.



డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేస్తున్న రైతు

పంట సాగు విధానాలు మారాలి

లావేరు: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని లావేరు, గోవిందపురం, గ్రామాల్లో ఫెర్టికమ్ సీడ్‌డ్రిల్ యంత్రం, డ్రమ్ సీడర్ యంత్రం ద్వారా సాగవుతున్న వరిసాగు ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఇటీవల రోజుల్లో వాతావరణంలో వస్తున్న మార్పుల వలన జూలై రెండువ వారం వస్తున్నా అవసరమైన మేరకు వర్షాలు పడకపోవడం రైతన్నల్లో ఆందోళన కలిగిస్తుందన్నారు. రైతులు ముందస్తుగా మేలుకొని మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేసవి దుక్కులు పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎరువు, విత్తనం ఒకేసారి వేసే యంత్రాన్ని ఉపయోగించి వరిసాగు చేయడం అన్నివిధాలా లాభదాయకం అన్నారు. దీనివలన సగం విత్తనాలు ఆదా అవడంతో పాటు కూలీల ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు మాట్లాడుతూ జూలైలో వర్షాలు అడపాదడపా కురిసినట్లైతే డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు ఎస్.సాయి, ఐ.అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాంబాబు

ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌పై ఎన్ఐఎ పోలీసులు అక్రమంగా కేసు బనాయించి గడచిన రెండేళ్లుగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జైల్లో నిర్బంధించారని వెంటనే ఆయనను విడుదల చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని చింతాడలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుడ్డు ప్రభాకర్‌కు బెయిల్ రాకుండా అడ్డుకుంటూ అక్రమంగా నిర్బంధించారని, అలాగే అరెస్టు చేసిన మరికొంత మందిని వెంటనే విడుదల చేయాలన్నారు. జులై 19న ఒంగోలులో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు అంబేద్కర్ భవన్‌లో జరగనుందని ఈ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజల హక్కుల కోసం పోరాడుతూ ఆకలి, అంటరానితనం లేని సమాజం కోసం నిరంతరం పోరాటం చేసి దళిత, పీడితుల పక్షాన నిలబడిన ప్రభాకర్‌ను అక్రమంగా అరెస్టు చేసి గత రెండేళ్లుగా జైల్లో నిర్బంధించడం అన్యాయమని, వెంటనే ప్రభాకర్‌ను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, మన్నేన నీలంనాయుడు, ఉప్పినివలస చలమయ్య, వంక సాయికుమార్, రాగోలు బాలకృష్ణ, శ్రవణ్ కుమార్, తోట రాజేష్, భార్గవి, హారతి, పవిత్ర పాల్గొన్నారు.



సోంపేట : పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి వరలక్ష్మి

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సోంపేట: మండలంలోని కొర్లాంలో శుక్రవారం ముమ్మరంగా పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ పనులను కార్యదర్శి వరలక్ష్మి పర్యవేక్షించారు. కొద్ది రోజులుగా కాలువల్లో పూడికలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇది గమనించిన కార్యదర్శి తక్షణమే పారిశుధ్య కార్మికులతో పనులు చేయించారు.

మెళియాపుట్టి: మండలంలోని మాకనపల్లి పంచాయతీలో సర్పంచ్ తాడేల వజ్రమ్మ, రామరాజు ఆధ్వర్యాన డ్రెయినేజీలో పూడికతీత పనులను చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయినేజీల్లో చెత్తచెదారంతో దోమల బెడద ఉంటుందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

వైసిపి రాష్ట్ర కమిటీలో ఇద్దరికి అవకాశం



ప్రేమ్‌కుమార్ లక్ష్మి

ఇచ్ఛాపురం : వైసిపి మున్సిపల్ విభాగ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా సూగ్గు ప్రేమ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా నీలాపు లక్ష్మిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు ప్రస్తుతం వార్డు కౌన్సిలర్లుగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీకి చేసిన సేవలకు గుర్తుగా అదనంగా రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో వైసిపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. వీరికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వైసిపి నాయకులు తిరుపతి, కేశవ హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం



శ్రీకాకుళం రూరల్ : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు, శుక్రవారం విశాఖ ఏ కాలనీ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార, శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులను సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చన్నారు.

ఆమదాలవలస: సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా టిడిపి నాయకులు మొదలవలస రమేష్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు పాల్గొని వారి వినతులు అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తాడి చంద్రశేఖర యాదవ్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పట్టణ టిడిపి అధ్యక్షులు సంపదరావు మురళీ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు తోట రాము, నాయకులు పివికె రాజు, బివి రమణమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలను తరలించొద్దు



పాఠశాల ముందు నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని రెండవ వార్డు కృష్ణాపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న మున్సిపల్ ప్రైమరీ పాఠశాలను తరలించొద్దంటూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు రోడ్డెక్కారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు నిరసన తెలుపుతూ ప్రైమరీ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేయొద్దంటూ అధికారులను వేడుకున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పాఠశాలను తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో ఎంతో మంది చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్నారని వారు గుర్తు చేశారు. పాఠశాలలో కనీసం 12 మంది విద్యార్థులు ఉండాలని నిబంధనలు చెబుతున్నప్పటికీ ఈ పాఠశాల పరిధిలో ఉన్న సుమారు 21 మంది విద్యార్థులను పక్కనే ఉన్న చిన్న కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలకు పంపేలా చర్యలు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలను తరలించడానికి ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠశాలను తరలించొద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి ఈ విద్యా సంవత్సరానికి మున్సిపల్ ప్రైమరీ పాఠశాలగానే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



బాధ్యతలు చేపట్టిన బాసుదేవ్ ప్రధాన్

పిఎసిఎస్ అధ్యక్షునిగా బాసుదేవ్ ప్రధాన్

ప్రజాశక్తి- కవిటి

కవిటి పిఎసిఎస్ అధ్యక్షునిగా బాసుదేవ్ ప్రధాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సిఇఒ జానకిరావు, రికార్డ్ అసిస్టెంట్ చిరంజీవి వీరికి నియామక పత్రాలు అందించారు. అదే విధంగా సింధుల గున్నయ్య, బొగిడియా భారతి సొసైటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాసుదేవ్ ప్రధాన్ మాట్లాడుతూ ఒక రైతుగా సాటి రైతులకు పారదర్శకంగా రుణాలు మంజూరు చేయడంలో తనవంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. అదే సమయంలో తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, దానికి సహకరించిన మండలంలోని నాయకులకు ప్రధాన్ కృతజ్ఞతలు తెలిపారు.

కీచకులపై చర్యలు తీసుకోవాలి

ఇచ్ఛాపురం: కాకినాడ జిజిహెచ్‌లో మెడికల్ విద్యార్థినులపై లైగింక వేధింపులకు పాల్పడిన కీచకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైసిపి మహిళా జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెల్ ఫోన్‌లో విద్యార్థినుల శరీర భాగాల ఫొటోలు తీసి వారికే పంపి బ్లాక్‌మెయిల్ చేయడం దారుణమన్నారు.

శభాష్ భవాని

టెక్కలి: విద్యారంగాన్ని బలపరుస్తూ ప్రభుత్వ పాఠశాలపై నమ్మకాన్ని కల్పించే దిశలో కృషిచేసిన ఉపాధ్యాయిని ఎన్.భవానిని డిఇఒ సదాశివిని తిరుమల చైతన్య అభినందించారు. మండలంలోని గంగాధరపేట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. గత విద్యా సంవత్సరం ముగింపులో విద్యార్థులు లేక మూతబడిపోతున్న దిశలో ఉన్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు భవాని తన నైపుణ్యాన్ని చూపించి పాఠశాల తెరిచిన 21 రోజుల వ్యవధిలో 22 మంది విద్యార్థులను చేర్పించారు. మూతపడుతున్న పాఠశాలకు మరలా జీవం పోసిన ఉపాధ్యాయులు భవాని కృషిని అభినందించారు. గంగాధరపేటకు సమీపంలో ఉన్న లక్ష్మీపురానికి చెందిన విద్యార్థులు కూడా ఈ పాఠశాలలోనే చేరారు. డిఇఒతో పాటు ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, ఎంఆర్‌సి సిబ్బంది ఉన్నారు.

కార్యకర్తే కీలకం



మట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: స్థానిక వైసిపి కార్యాలయంలో రణస్థలం మండలం అర్జునవలస పంచాయతీయ కార్యకర్తలతో 'కార్యకర్తే కీలకం' సమావేశంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే కీలకమన్నారు. కార్యకర్త కృషి ఎనలేనిదని, కార్యకర్త కోసం ఎంత చేసినా తక్కువే అని అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం ఎన్నెన్నో హామీలు ఇచ్చి బూటకపు మాటలు చెప్పి కాలయాపన చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ నిరాశ చెందు తున్నారన్నారు. వైసిపి కార్యకర్తలను భయందోళనలకు గురి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వైసిపి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను గ్రామాల్లో ప్రజలకు తెలియ జేయాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలని, వాటిని పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మీసాల రామునాయుడు, ఉప సర్పంచ్ రామిశెట్టి మహేష్, నాయకులు కొత్తకోట ఉత్తర కుమార్, సిరిపురపు శ్రీరామ్, కోట్ల అప్పల నాయుడు, భీముడు, తవుడు, గిరడ సన్యాసిరావు, కొత్తకోట అప్పల నాయుడు పాల్గొన్నారు.



పలాస : సన్మానిస్తున్న అధికారులు

బదిలీ అధికారులకు సన్మానం

పలాస : ఉద్యోగం ఒక బాధ్యత వంటిదని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించాలని పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ ఎం.రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ ఎడిఎ కార్యాలయంలో శుక్రవారం పలాసలో పని చేసిన ఎడిఎ ఎల్.వి.మధు బదిలీపై నరసన్నపేట, ఇదే కార్యాలయంలో పని చేసిన ఎఒ శిరీష నరసన్నపేట ఎడిఎ కార్యాలయం, వజ్రపుకొత్తూరు మండలంలో ఎఒగా పనిచేసిన కిరణ్‌వాణి పాతపట్నం ఎఒ, ఇదే కార్యాలయంలో పని చేసిన సీనియర్ అసిస్టెంట్ రాజేష్ ఆముదాలవలస సోయల్ టెస్టింగ్ ల్యాబ్, వజ్రపుకొత్తూరు ఉద్యానవన శాఖ అధికారి శిరీష నరసన్నపేట ఉద్యానవనశాఖ అధికారిగా ఇటీవల బదిలీ అయ్యారు. బదిలీ అధికారులకు వ్యవసాయ శాఖ అధికారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ పోలారావు, నాగరాజు, దానకర్ణుడు, ఉద్యానవన శాఖ అధికారి శంకరదాస్, పాపారావు గిరి శ్రీనివాసరావు, జోత్స్న పాల్గొన్నారు.

సోంపేట : వ్యవసాయశాఖ సహాయ సంచాలకులుగా కె.జగన్మోహనరావు విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. ఎడిఎ భవానీశంకర్‌తో పటు నాలుగు మండలాల వ్యవసాయశాఖ అధికారులు దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ఎరువులు దుకాణాల యజమానులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బూడిదైన సామగ్రి

గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని పదో వార్డు వాంబే కాలనీలో గ్యాస్ లీకై ఇద్దరు గాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. వాంబే కాలనీకి చెందిన గుంటుకు సరస్వతి టిఫిన్ వ్యాపారం నిర్వహిస్తూ ఉంటుంది. శుక్రవారం ఉదయం ఇంట్లో సరస్వతి టిఫిన్ తయారు చేస్తూ ఉండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎదురు ఇంట్లో నివసిస్తున్న కోలా మాధవరావు సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు ఆర్పడానికి ప్రయత్నించగా ఆయన కూడా గాయాల పాలయ్యాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది జరిగిన నష్టాన్ని పరిశీలించి జరిగిన నష్టాన్ని నమోదు చేసుకొని వెనుతిరిగారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు సుమారు రూ.70 వేలు వరకు నష్టం జరిగినట్లు సమాచారం. ఎస్ఐ ఎస్.బాలరాజుకు ఫోన్‌లో సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అలాగే గ్యాస్ సిబ్బంది పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును బాధితురాలను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు సరస్వతి మెట్టెక్కివలసలోని వాంబే కాలనీ వద్ద తోపుడు బండిపై టిఫిన్ వ్యాపారం నిర్వహిస్తూ ఉంటుంది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు కలరు. కుమారుడు, కుమార్తె ఈమెకు వ్యాపారంలో సహాయంగా వుంటారు. స్థానిక టిడిపి నాయకుడు నాగళ్ల మురళీధర్ యాదవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలను పరామర్శించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని బాధితురాలికి హామీ ఇచ్చారు.

సైకిళ్ల పంపిణీ



సంతబొమ్మాళి : సైకిళ్లను పంపిణీ చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న సుమారు 40 మంది పేద విద్యార్థులకు, తల్లి తండ్రి లేని అనాథ పిల్లలకు వసుదైక కుటుంబం శుక్రవారం ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సైకిళ్లను డిఇఒ సదాశివుని తిరుమల చైతన్య అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు పూజారి హరిప్రసన్న, ఈశ్వరరావు మాట్లాడుతూ ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహంగా వంద మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున విద్యా సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, గుణశేఖర్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని కొల్లిపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వసుదైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ సైకిళ్లను అందజేసింది. హెచ్ఎంఎం రామారావు, సిబ్బంది ఆధ్వర్యాన జె.లిద్దు, జి.హేమ, టి.పూజిత, జి.త్రివేణిలకు పంపిణీ చేశారు. సైకిళ్లను బహుకరించి విద్యార్థులను ప్రోత్సహించినందుకు హెచ్ఎం ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్ఎంసి చైర్మన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు



గ్రామసభలో మాట్లాడుతున్న తోటయ్యదొర

ప్రజాశక్తి- లావేరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంలో చేపట్టిన పనుల్లో సామాజిక తనిఖీల్లో పారదర్శకత ఉండాలని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. శుక్రవారం లావేరు సచివాలయ ఆవరణలో సామజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌పి రామారావు మాట్లాడుతూ లావేరు పంచాయతీలో 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్‌లో రూ.2.2 కోట్లతో చేపట్టిన పనులను గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టడం జరిగిందని ఆ వివరాలను వివరించారు. సమావేశంలో సర్పంచ్ ఊర్లాపు లక్ష్మి, మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, కార్యదర్శి దాలినాయుడు, టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, లంకలపల్లి మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవకతవకలు గ్రామసభలో బట్టబయలు

మండల కేంద్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల్లో అధికశాతం అవకతవకలు పాల్పడినట్లు సామాజిక తనిఖీ గ్రామసభలో బట్టబయలైంది. ఆ వివరాలను డిఆర్‌పి రాంబాబు చదివివినిపించారు. అధికంగా పనులకు వెళ్లకుండా పనికి వెళ్లినట్లుగా దొంగ మస్టర్లు వేసినట్లు, కొలతల్లో భారీ తేడాలు, ఒకరికి బదులు వేరొకరు పనికి వెళ్లడం, పనికి వెళ్లనివారికి పనికి వెళ్లినట్లు దొంగ మస్టర్లు వేసి బిల్లు స్వాహ భారీగా జరిగినట్లు సభలో వెల్లడించారు. లావేరులో ఫీల్డ్ అసిస్టెంట్ పతివాడ రాము సుదీర్ఘంగా విధులకు డుమ్మాకొట్టడం, హాజరు కాకపోవడంతో ఇష్టానుసారంగా అవకతవకలకు పాల్పడటంతో రూ.లక్షల్లో దుర్వినియోగం జరిగినట్లుగా వెల్లడించారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎమ్మెల్యే ఆస్పత్రి సందర్శన

ప్రజాశక్తి- సారవకోట

మండలంలోని బుడితి సామాజిక ఆస్పత్రిలో ఇటీవల గర్భిణులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మృతుల కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం స్థానిక ఆస్పత్రిని సందర్శించారు. ఇద్దరు గర్భిణులు మృతి చెందిన ఘటనపై స్థానిక వైద్యాధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మాట్లాడుతూ ఎమ్మెల్యే బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈయనతో పాటు నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్జన, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫణీంద్రకుమార్‌కు అరుదైన అవకాశం



పట్టా అందుకుంటున్న ఫణీంద్రకుమార్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చిన్నబడాంకు చెందిన అట్టాడ ఫణీంద్ర కుమార్ బెంగళూరులోని డిఆర్‌డిఎలో పరిశోధన శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. బిటెక్ సివిల్ కోర్సును (మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ సాధించి) ఐఐటి భువనేశ్వర్‌లో పూర్తి చేశారు. అలాగే చంటెక్ సివిల్ స్ట్రక్చర్స్ కోర్సును చదివేందుకు ఐఐటి మద్రాస్‌లో సీట్ సాధించాడు. అనంతరం ఏరో స్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో బెంగళూరు ఐఐఎస్‌సిలో 2020లో పిహెచ్‌డి చేసేందుకు ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికై నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్‌కు అర్హత పొందారు. మధ్యలో వేర్వేరు స్కాలర్ షిప్‌ల ద్వారా పరిశోధనలకు నెదర్లాండ్స్, పోర్చుగల్ యూనివర్సిటీల్లో విధులు నిర్వహించారు. ఈ ఏడాదిలో పిహెచ్‌డి పూర్తి చేశారు. అదే సమయంలో బెంగళూరు డిఆర్‌డిఒ విభాగంలో పరిశోధన శాస్త్రవేత్తగా నియామకమయ్యారు. ఫణీంద్ర కుమార్‌కు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గీత

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఆమదాలవలస: పారిశుధ్య లోపంతో అనారోగ్య కారణాలకు గురవుతున్న ప్రజలు పరిసరాల పరిశుభ్రత అందరూ బాధ్యతగా భావించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని రామలింగేశ్వర పార్కులో స్వచ్ఛభారత్ నిధులు రూ.6 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ మాట్లాడుతూ పార్కుతో పాటు సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయానికి వచ్చే పట్టణ ప్రజలు మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులకు గురవు తున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించడానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లగా నాలుగు మరుగుదొడ్ల నిర్మాణాలకు స్వచ్ఛభారత్ నిధులు రూ.5 లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేయించారని తెలిపారు. ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ జాన్సన్, మాజీ కౌన్సిలర్ గుడ్ల రాజ్యలక్ష్మి, నాయకులు జి.డి.ప్రసాద్, పివికె రాజు, కూన ఆంజనేయులు, బి.వి. రమణమూర్తి, రమణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం



నిర్మాణంలో ఉన్న ఆలయం

కవిటి : కవిటిలో దాతల సహాయంతో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధికి దాతలు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా విశాఖపట్నంలో ఉంటున్న జల్లుపుట్టుగకు చెందిన జల్లు శ్రీను, అమృత దంపతులు రూ.లక్షా పదహారు వేలు విలువ చేసే ఇనుమును విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బిపి రెడ్డి, మొగలిపురి సీతారాం, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతే లక్ష్యం



పలాస : మాట్లాడుతున్న ఎంపిడిఒ వసంతకుమార్

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీల పురోగతే లక్ష్యంగా పనిచేయాలని ఎంపిడిఒ త్రినాథ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం మండల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి పనితీరు గల పంచాయతీలను ప్రోత్సహించడమే కాకుండా వెనుకబడిన గ్రామాలకు అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందులో భాగంగా ఉపాధి, విద్యా సదుపాయాలు, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను పరిగణించి లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసరెడ్డి, ఎఒ పిరియా శ్రీదేవి, ఎంఇఒ ధనుంజయ మజ్జి, డిప్యూటీ ఎంపిడిఒ అబ్దుల్ ఖాన్ పాల్గొన్నారు.

కొత్తూరు : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతే లక్ష్యంపై ఎంపిడిఒ నీరజ సమీక్షించారు. సమావేశంలో వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు, పరిపాలన అధికారి బి.రాంబాబు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలాస : ప్రభుత్వం చెప్పిన పనిలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ వసంతకుమార్ అధికారులకు, ఎఎన్ఎంలకు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఎంఇఒ చెరుకుపల్లి సత్యం, రెంటికోట వైద్యాధికారి సునీల్ కుమార్, వెంకటాపురం వైద్యాధికారి దేవి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీలో సుపరిపాలనే లక్ష్యంపై డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విమలారాణి పాల్గొన్నారు.

లావేరు: గ్రామ పంచాయతీలు సర్వతోముఖాభివృద్ధిలో ప్రతి ఒక్కరు లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేయాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ 2.0 అంశంపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మజా, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పొందూరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ మన్మథరావు

పొందూరు: పంచాయతీలు తమ లక్ష్యాల సాధన ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించాలని ఎంపిడిఒ మీసాల మన్మథరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల పురోగతి సూచిక 2.0పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలపై శిక్షణ అందించారు. ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

నరసన్నపేట: నరసన్నపేట నారాయణ హైస్కూల్ విద్యార్థులతో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నారాయణ హైస్కూల్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం ప్రాధాన్యత, కాలుష్యం పోవాలంటే మొక్కలు నాటాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎజిఎం ఐ.రమేష్, ప్రిన్సిపాల్ ఎ.రమేష్, డీన్ హరి, ఎఒ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట పట్టణం, 12,13 వార్డు పరిధిలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అమలు చేయనున్న సంక్షేమం, అభివృద్ధిపై శుక్రవారం వివరించారు. ప్రజలు చెప్పిన సమస్యలను సంబంధిత అధికారులకు చెప్పి పరిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్ : పోస్టర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాకుళం రూరల్: టిడిపి ప్రజల ప్రభుత్వమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కాజీపేట, అరసవల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామాల్లో ఇంటిం టికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిని వివరిం చారు. నగర పార్టీ అధ్యక్షులు, వార్డు ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని హరిపురం పంచాయతీలో నిర్వహించిన తొలి అడుగు టిడిపి మండల అధ్యక్షులు పద్మనాభం, ప్రధాన కార్యదర్శి దక్కత కామేశ్వరరావు, మాజీ ఎంపిపి ఢిల్లీరావు, పిఎసిఎస్ అధ్యక్షు లు బాబ్జి, డి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని పల్లిగొల్లగండిలో నిర్వహించిన తొలి అడుగులో టిడిపి మండల అధ్యక్షుడు మద్దు కుమార్, చంద్ర మోహన్, చిత్రాడ శ్రీను, రెల్ల నారాయణ, నిట్ట గోపాల్, మద్దు రాజారావు, మద్దిల నాగేశ్వరరావు, బుద్దేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బైరాగి

శక్తియాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శక్తియాప్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని శక్తిటీమ్ ఎఎస్ఐ బైరాగి అన్నారు. మండలంలోని పూండి సాయి వినీత్ విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థినులకు శక్తియాప్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థల్లో ఆడపిల్లలు భద్రత కార్యక్రమాలను సంబంధించిన శక్తి యాప్ గురించి కాశీబుగ్గ శక్తి టీం పోలీసులు వివరించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ సైబర్ నేరాలు ఒటిపిల ద్వారా మోసాలు ఎలా జరుగు తున్నాయన్న విషయాలు తెలియజేశారు. కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీస్ శక్తి టీమ్ సభ్యులు, ప్రిన్సిపాల్ కైలాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



వెంకటరమణను సన్మానిస్తున్న సురేష్‌కుమార్

బిసిల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి- కొత్తూరు

బిసిల అభ్యున్నతికి తనవంతు తోడ్పాటు అందిస్తానని టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ అన్నారు. మాతలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కూటికుప్పల సురేష్ కుమార్ శుక్రవారం ఆయనను గౌరవపూర్వకంగా కలిశారు. బిసిల అభివృద్ధికి పూర్తి స్థాయిలో తన సహాయ సహకారం ఉంటుందని హామీఇచ్చారు. బిసిల అభ్యున్నతి కోసం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. సంఘ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షులు వై.సూకానమ్మ మీ అడుగుజాడల్లో పనిచేసి జిల్లాలో జాతీయ బిసి సంక్షేమ సంఘం బలోపేతం చేయాలని సూచించారని సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పిళ్లా కన్నన్నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కవిటి దేవరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శి కిల్లి కుమారస్వామి, బూర్జ మండల అధ్యక్షులు అంపిలి గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కడగల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పర్యటన

ప్రజాశక్తి- సారవకోట

మండలంలోని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం పర్యటించారు. చీడిపూడిలో వెంకటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపిపి పాఠశాలలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలకు కావాల్సిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాల సౌకర్యం లేదని తెలియజేయడంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. పక్కనే ఉన్న సచివాలయం సిబ్బందితో కాసేపు మాట్లాడారు. గ్రామంలోని చెరువు ఆక్రమణలు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, చలపతి, యుగంధర్, ప్రసాద్, మహేష్, దిలీప్, హిమగిరి, సాయి, శ్రీను, సోమేష్, శివకుమార్, లోకేష్ పాల్గొన్నారు.



పర్యటిస్తున్న జనసేన నాయకులు

వైసిపి ఎస్‌సి విభాగానికి ఇద్దరు నియామకం

కోటబొమ్మాళి: వైసిపి మండల ఎస్‌సి విభాగం అధ్యక్షునిగా మండలంలోని కన్నేవలస మాజీ సర్పంచ్ కళ్ల గణపతి, సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా జీయన్నపేట మాజీ సర్పంచ్ ప్రతినిధి పొన్నాడ మోహనరావులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం నియామక ఉత్తర్వులు అందాయి. మాపై నమ్మకంతో ఈ పదవులు కట్టబెట్టిన పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్‌కు, మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



గణపతి , మోహనరావు



ఆర్అండ్‌బి కార్యాలయంలో నిర్వహిస్తున్న వేలం పాట

కూలిన చెట్టుకు వేలం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని భగవానుదాసుపేట వద్ద కూలిన చెట్టును తొలగించేందుకు శుక్రవారం ఆర్అండ్‌బి కార్యాలయంలో ఎఇ పి.టి.రాజు ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. పొందూరు - చిలకపాలెం రహదారిలో భగవానుదాసుపేట వద్ద ఇటీవల అర్ధరాత్రి భారీ మర్రిచెట్టు కూలింది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ రహదారిలో ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదు. వెంటనే ఎస్ఐ సత్యనారాయణ అర్ధరాత్రి అక్కడికి చేరుకుని చెట్టును రహదారి పైనుంచి తొలగించారు. కూలిన ఈ చెట్టును రూ.5,500లకు చిత్తిరి శ్రీనివాసరావు వేలం పాటలో కొనుగోలు చేశారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



కవిటి : అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కవిటి : స్థానిక ఎస్‌విజె. డిగ్రీ, జూనియర్ కాలేజీ యూనిట్ విద్యార్థుల ఆధ్వర్యాన ప్రపంచ జనాభా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, పి.సత్యనారాయణ, ఆర్.మహేష్, జి.జగన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అంపోలు రామారావు, లుక్‌పాల్, కోటేశ్వరరావు, త్రినాథరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు పరిమళ, ఎన్.నందిని ఆధ్వర్యాన ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహి ంచారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం. గోవిందరావు, ఇఒ ఎస్.మోహనరావు, సూపర్‌వైజర్ జి. రాజేశ్వరి, పిహెచ్ఎండి జయలక్ష్మి, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జనాభా పెరుగుదల, దాని పర్యవసానాలు, ఆరోగ్య, సమానత్వ అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమం, భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ - మేరా యువ భారత్ (ఎన్‌వైకె) మరియు అర్థిక శాస్త్ర విభాగం, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. సుధ పాల్గొని మాట్లాడుతూ, అభివద్ధి చెందుతున్న దేశాల్లో జనాభా పెరుగుదల ప్రధాన సవాలుగా మారిందని పేర్కొన్నారు. పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలు అధిక జనాభా వల్లనే ముద్ర పడుతున్నాయని, వీటిని ఎదుర్కొనడానికి సమగ్ర విధానాలు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వై. పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్. శ్రీనివాస పాత్రో పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో ఎకనామిక్స్, జువాలజీ విభాగాలయూత్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో, ప్రపంచ జనాభా దినో త్సవం అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డా. కె. సూర్యచంద్రరా వు,. డా. అరవింద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ శుక్రవారం సమీక్షించారు. జులై నెలలో బిఆర్‌సి సెంటర్‌లో పంటలకు అనుగుణంగా నిల్వ ఉన్న కషాయాలు తయారీ చేయాలన్నారు. జీడి, మామిడి తోటల్లో నవధాన్యాలు సాగు చేయాలన్నారు. వాటి ద్వారా వచ్చిన విత్తనాలు రాబోయే రబీ సీజన్‌కి వాడుకోవాలన్నారు. ఎన్ఎఫ్ఎ గోవిందరెడ్డి మాట్లాడుతూ వరి ఎదలో నవధాన్యాలు సాగు ఎలా వేసుకోవాలో సిబ్బందికి చెప్పారు. సమావేశంలో సూర్యనారాయణ, చిన్నమ్మడు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఐసిఆర్‌పిలు, డిజిటల్ సిబ్బంది పాల్గొన్నారు.